క్లుప్తంగా

కలెక్టర్ రాకతో శుభ్రపడిన రోడ్డు



శుభ్రంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలోని రూరల్ తహసీల్దార్ కార్యాలయం,వె టీసీ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు ఇరువైపులా తుప్పలు, చెట్లు, తాగేసిన కొబ్బరి బొండాలతో దర్శనమిచ్చేంది. రాత్రి సమయంలో అయితే చెప్పనవసరం లేదు. వీధిలైట్లు లేక చీకటిలోనే ఉద్యోగులు, ప్రజలు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. అటువంటి ఈ రోడ్డుకు శనివారం వైటీసీలో ఈ-వ్యర్థాలపై అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో పాటు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. దీంతో పంచాయతీ అధికారులు ఆఘమేఘాలపై ఆ రోడ్డును శుభ్రం చేశారు. దీంతో రాత్రి సమయం వీధిలైట్లు కూడా వెలిగేలా చూడాలని స్థానికులు, ఉద్యోగులు కోరుతున్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న మిరప రమేష్ మిత్ర బృందం

ధవళేశ్వరం: ఈస్టర్ పర్వదినం సందర్భంగా ధవళేశ్వరంలోని క్రైస్తవ సమాధుల వద్ద బాగుజేస్తున్న వారికి వైఎస్సార్ సీపీ నాయకుడు మిరప రమేష్ ఆధ్వర్యంలో శనివారం మజ్జిగను పంపిణీ చేశారు. మిరప రమేష్ నానమ్మ మిరప వజ్రమ్మ జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి వందలాది మందికి మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాకే పవన్, తేజ, మహేష్, విల్సన్, కుమార్, శ్రీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'గాయత్రీ'లో ఉత్తమ ఫలితాలు



అతిథులను సన్మానిస్తున్న యాజమాన్యం

రాజానగరం: కానవరంలో ఉన్న గాయత్రీ విద్యా సంస్థల 11వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తిరుమల విద్యా సంస్థల అధినేత నున్న తిరుమలరావు, ఆదికవి నన్నయ యూనివర్సిటీ అధ్యాపకులు మల్లిడి అమ్మిరెడ్డి మాట్లాడుతూ క్వాలిటీ విద్యను అందించడం ద్వారా గాయత్రీ విద్యా సంస్థలు ఉత్తమ ఫలితాలను అందుకుంటున్నాయన్నారు. ఇంటర్ సెకండియర్‌లో స్టేట్ ఫోర్త్ ర్యాంకును అందుకున్న విద్యార్థితోపాటు ఉత్తమ ప్రతిభను కనబర్చిన ఇతర విద్యార్థులను కూడా మెమెంటోలు అందజేసి, అభినందించారు. అనంతరం గాయత్రీ యాజమాన్యం అతిథులను కూడా దుశ్శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేసింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీలు నిరసన



డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎంఎల్‌హెచ్‌పీలు

రాజమహేంద్రవరం రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ శనివారం మధ్యాహ్నం భోజన విరామ సయమంలో మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్(ఎంఎల్‌హెచ్‌పీ) నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీలు తమ ఉద్యోగాలను రెగ్యులైజేషన్ చేయడంతో పాటు, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యశాఖ అధికారులకు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలోనే జాయిన్ అయ్యేలా కృషి చేయాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వెల్ఫేర్ అసిస్టెంట్లకు, కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మండలంలో గల 81 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 273 మంది చిన్నారులు ఒకటో తరగతిలో జాయిన్ అవుతారని, వారిలో 123 మంది ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విల్లింగ్ ఇచ్చారన్నారు. మిగిలిన వారిని కూడా ప్రోత్సహించి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలన్నారు.

పారిశుధ్యం అధ్వానం



ఇండస్ట్రియల్ కాలనీలో పేరుకుపోయిన చెత్త



- వీధుల్లో పేరుకుపోయిన చెత్త
- వ్యర్థాలతో నిండిన డ్రైన్లు
- ఇబ్బంది పడుతున్న ఇండస్ట్రియల్, ఇందిరా స్వర్ణనగర్ ప్రజలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసుల ఆవేదన

ధవళేశ్వరం: ఆ కాలనీల్లో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయింది. డ్రైన్లు అధ్వానంగా ఉన్నాయి. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సుమారు 600 కుటుంబాలు నివసిస్తున్న స్థానిక ఇండస్ట్రియల్ కాలనీ, ఇందిరా స్వర్ణనగర్‌లలో పారిశుధ్యం పడకేసింది. ప్రతి రోజూ కాలనీలో పారిశుధ్య నిర్వహణ జరగకపోవడంతో తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. ఏ వీధి చూసినా చెత్త పోగులతో ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణ ప్రతిరోజూ చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడంలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అపరిశుభ్రత కారణంగా తరచూ అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా కాలనీలో వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయంలో అంధకారం నెలకొంటుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. కాలనీలో వీధి లైట్లను వెంటనే వెలిగించే ఏర్పాటు చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణను గాడిన పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీలో ఉన్న డ్రైనేజీలలో పూడికలను కూడా తొలగించడంలేదని ఆరోపిస్తున్నారు. సమస్యపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఇండస్ట్రియల్ కాలనీ,ఇందిరా స్వర్ణ నగర్‌లో నెలకొన్న సమస్యలపై పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా..



ఇండస్ట్రియల్ కాలనీలో నెలకొన్న అపారిశుధ్యంపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. చెత్తను తొలగించకపోవడంతో కాలనీలో ఎక్కడ చూసినా చెత్త పోగులే కనిపిస్తున్నాయి. వీధి లైట్లు వెలగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– గోలి దేవకుమార్, ఇండస్ట్రియల్ కాలనీ వాసి

అపరిశుభ్రతతో ఇబ్బంది



ఇండస్ట్రియల్ కాలనీ, ఇందిరాస్వర్ణ నగర్‌లో అపరిశుభ్రత నెలకొంది. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగక తీవ్ర దుర్వాసన వస్తోంది. కాలువల్లో పూడికలు తొలగించడం లేదు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి కాలనీలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలి.

– తుటారపు సురేష్, ఇందిరాస్వర్ణ నగర్ వాసి

తెలుగుజాతికే గర్వకారణం సర్దార్ గౌతు లచ్చన్న

- జయంతి, వర్ధంతులను అధికారికంగా జరపాల్సిన అవసరముంది
- వర్ధంతి కార్యక్రమంలో నివాళులర్పించిన మాజీ ఎంపీ భరత్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): సర్దార్ గౌతు లచ్చన్న యావత్ తెలుగుజాతికి గర్వకారణమైన వ్యక్తి అని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆ మహనీయుని జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా గౌడ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యాన రాజమహేంద్రవరంలోని వైజంక్షన్ వద్ద ఉన్న లచ్చన్న విగ్రహం దగ్గర జరిగిన కార్యక్రమంలో భరత్ పాల్గొని, పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తిగా గౌతు లచ్చన్న జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.



గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న మార్గాని భరత్



గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న గూడూరి శ్రీనివాస్

గీతకులాలకు ఆరాధ్యదైవం గౌతు లచ్చన్న

అనంతరం రాజమహేంద్రవరం గోదావరి గట్టు దగ్గర ఉన్న గౌతు లచ్చన్న విగ్రహం దగ్గర వైఎస్సార్‌సీపీ నాయకుడు వాసంశెట్టి గంగాధరరావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ భరత్ పాల్గొని లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సర్దార్ గౌతు లచ్చన్న చిరస్మరణీయుడు

సీటీఆర్ఐ: సర్దార్ గౌతు లచ్చన్న చిరస్మరణీయుడని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కొనియాడారు. స్థానిక వై జంక్షన్, గోదారి గట్టున ఉన్న వాటర్ వర్క్స్ సమీపంలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాలకు పూలమాలలు వేసి శనివారం ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి రాజు, క్రెడె చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్, మార్గాని చంటిబాబు, కోడి ప్రవీణ్, పెంకే సురేష్, వాసంశెట్టి గంగాధర్, సప్పా ఆదినారాయణ, బిల్డర్ చిన్న, కడియాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతిలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి పాల్గొని నివాళులర్పించారు.

ఈస్టర్ పండగకు ఏర్పాట్లు

- ఈస్టర్ పర్వదినానికి సమాధుల ముస్తాబు
- పూలు, రంగులతో అలంకరణలు

సీటీఆర్ఐ: ఏసుక్రీస్తు శిలువ మరణం పొంది తిరిగి లేచిన రోజైన ఈస్టర్(పునరుత్థాన పండగ) పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని సమాధుల తోటలను ముస్తాబు చేశారు. తమను వీడి పరలోకగతులైన ఆత్మీయ బంధు మిత్రులు సమాధులను వారి కుటుంబ సభ్యులు పూలు, రంగులతో ముస్తాబు చేశారు. క్రైస్తవులందరూ ఆదివారం తెల్లవారు జామున పువ్వులు, కొవ్వొత్తులు వెలిగించి సమాధుల తోటలో ప్రార్థనలు నిర్వహించనున్నారు. అందుకనుగుణంగా సమాధులను శుభ్రంగా కడిగి, వాటికి రంగులు పూచి, పూలతో అలంకరించారు. తెల్లవారు జాము వరకు ఈ అలంకరణ ప్రక్రియ చేశారు. బైపాస్ రోడ్డులో ఉన్న లూథరన్ సమాధుల తోటలలోనూ, క్వారీ మార్కెట్ వద్ద గల సమాధుల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు.



పూర్వీకుల సమాధులను శుభ్రం చేస్తున్న బంధువులు

ప్రజలకు చేరువగా వాట్సాప్ గవర్నెన్స్

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరవ చేసేందుకు ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. బొమ్మూరులోని వైటీసీ ప్రాంగణంలో ఈ-వ్యర్థాల అవగాహన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నగరపాకలసంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌లతో కలిసి వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకి అందజేస్తున్న వివిధ పౌర సేవలు మరింతగా చేరువ చేసే క్రమంలో వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 నంబర్ తీసుకువచ్చామని, మీసేవా, వార్డు సచివాలయంల ద్వారా పొంది అన్ని రకాల సేవలను ఈ వాట్సాప్ నంబర్ ద్వారా పొందవచ్చన్నారు. జిల్లా స్థాయి అధికారులు, మహిళలు పాల్గొన్నారు.



వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల, కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ కేతన్‌గార్గ్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- మంత్రి కందుల దుర్గేష్
- స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఈ-వ్యర్థాలపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సరైన విధానంలో డిస్పోజ్ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. బొమ్మూరులోని వైటీసీ ఆవరణలో జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ-వ్యర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతి, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ముందుగా మొక్కలు నాటి, ఈ వేస్ట్‌స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వస్తువులను సరైన విధంగా వాడడం, తిరిగి వాటిని ఉపయోగించడం, మరమ్మతులకి గురైన వాటిని సరైన విధంగా డిస్పోజ్ చేయడంతో అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజలందరూ చిత్తశుద్ధితో మీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఏజెన్సీస్‌కు అందజేయాలని కోరారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే నష్టాలను, అనర్థాలను ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించామన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపు ఇచ్చారు. ఇంటిలో వృథాగా ఉన్న ఈ వేస్ట్ గుర్తించి తెలుసుకొని ఈ-వెస్ట్ కలెక్షన్ కేంద్రాలను అందజేయాలని కోరారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ అందరం కలిసి కట్టుగా ఈ వెస్ట్ కలెక్షన్ కేంద్రాలకు వ్యర్థాలను అందజేద్దామని అన్నారు. నగరపాలకసంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ స్క్రాప్‌పై ప్రత్యేక థీమ్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలకి నిర్దేశిత కాలం ఉంటుందని, ఆ తర్వాత వాటిని సరైన విధంగా డిస్పోజ్ చేయాలన్నారు. తద్వారా ఆదాయం కూడా పొందే అవకాశం ఉంటుందని వివరించారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వి.శాంతామణి , రాష్ట్ర రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ బలరామ్, డీఆర్‌డీఏ పీడీ ఎస్‌వీఎస్ మూర్తి, డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు, డీఎల్‌డీవో పి.వీణాదేవి, మండల ప్రత్యేక అధికారి కేవీఎస్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఈ-వేస్ట్ కేంద్రాలను పరిశీలిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల, కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ కేతన్‌గార్గ్ తదితరులు



కడియంలో ఈ వ్యర్థాలు సేకరిస్తున్న ఎంపీడీవో రమేష్, పంచాయతీ సిబ్బంది

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఈ వ్యర్థాలను రిసైకిల్ చేసి పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా స్వచ్ఛాంధ్రప్రదేశ్ వైపు పయనిద్దామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. శనివారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు(ఈ-వేస్ట్) సేకరించి వాటిని సురక్షిత పద్ధతులలో రిసైకిల్ చేయడం ప్రారంభించాన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ గూడ్స్ సరైన రీతిలో మనం డిస్పోజ్ చేసి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి మనం భూమిని కాపాకుందామన్నారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఎలక్ట్రానిక్ వేస్ట్ సరైన విధానంలో డిస్పొజల్ చేయాలని ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ కె.నైముల్లా అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఈ-వ్యర్థాల నివారణ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఆవరణలో సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. పర్యవేక్షణ ఇంజినీర్ జి.కాంతు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ ఎస్‌బీవీ రెడ్డి, వై.రవీంద్ర, జి.శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కడియం: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఎంపీడీవో కే రమేష్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర భాగంగా ఈ-చెక్ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఎలక్ట్రానిక్ వేస్ట్ వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కడియంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, సర్పంచ్ మోసిగంటి సత్యవతి తదితరులు పాల్గొన్నారు. జేగురుపాడులో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్ ప్రాంభించారు. పంచాయతీ కార్యదర్శి ఐనవిల్లి శ్రీనివాస్, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ రామకృష్ణ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కె ఆధ్వర్యంలో ఎలెక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ, నిర్వీర్యం అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు ఎలెక్ట్రానిక్ వ్యర్థాలు పోస్టర్ ప్రదర్శన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. జి.రవితేజ, ఎస్ఎస్ఏ సమన్వయ కర్త, ఏపీఎస్ఎస్‌డీసీ నాన్ టెక్నికల్ ఆఫీసర్ సీహెచ్ పద్మావతి, డాక్టర్లు యు.సౌందర్య, దేవరాజు, సుజాత ఎలెక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించారు.

ధవళేశ్వరం: ఈ-వేస్ట్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె గోపీనాథ్ పేర్కొన్నారు. సాసా ప్రోగ్రాంలో భాగంగా శనివారం ఈ-వేస్ట్‌పై ఎస్ఈ గోపీనాథ్ ఆధ్వర్యంలో కాటన్ బ్యారేజ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ-వేస్ట్‌కు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఉద్యోగులు రవికుమార్ ,జె కుంతీదేవి సత్యశ్రీ, ఆనంద్‌బాబు, శ్రీనివాస్, పుసులూరి శేషుకుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కొవ్వూరు: దొమ్మేరు గ్రామానికి చెందిన లంక నాగ శ్రీసత్య సాయికుమార్ (22) శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయికుమార్ ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు బంధువులు చెబుతున్నారు. తల్లిదండ్రులిద్దరూ ఆసుపత్రి పనిపై బయటికి వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో రాత్రి తొమ్మిది గంటల సమయంలో సాయికుమార్ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చిన స్నేహితుడు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ పి.విశ్వం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతుడికి ఇద్దరు వివాహమైన సోదరీమణులున్నారు. తల్లిదండ్రులు ఉన్నారు.

పెట్రోల్ బంకులో తనిఖీలు

నల్లజర్ల: మండలంలోని గంటావారిగూడెంలోని పెట్రోల్ బంక్‌లో కొలతలు, నాణ్యతలో తేడాలు వస్తున్నట్టు వినియోగదారుల ఫిర్యాదుల మేరకు శనివారం తూనికలు, కొలతలు శాఖ అధికారులు తనిఖీలు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్నీ సక్రమంగానే ఉన్నాయన్నారు. వినియోగదారుల అనుమానాలను నివృత్తి చేయడానికి తనిఖీలు చేసినట్టు లీగల్‌మెట్రాలజీ (వెయిట్స్, మెజర్‌మెంట్స్)శాఖ అసిస్టెంట్ బి.సాయిరాం తెలిపారు. తనిఖీల్లో అసిస్టెంట్ సివిల్ సప్లయి అధికారి ఎం.నాగాంజనేయులు, లీగల్ మెట్రాలాజీ ఎస్ఐ జీవీ ప్రసాద్, సివిల్ సప్లయి డీటీ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపులకు నేడు ప్రత్యేక కౌంటర్లు

రాజమహేంద్రవరం సిటీ: గత ఏడాది ఆర్థిక సంవత్సరంలో బకాయి ఉన్న పన్నులపై వడ్డీ రాయితీ 50శాతం, అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరం పన్ను ఏక మొత్తంగా చెల్లించిన వారికి పన్నులో 5 శాతం రాయితీ ఇస్తూ ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కేతన్ గార్గ్ శనివారం విజ్ఞప్తి చేశారు. ఆదివారం సెలవు రోజైనప్పటికీ చెల్లింపుదారుల సౌకర్యం కోసం నగరపాలక సంస్థలో ఉన్న ట్రెజరీ, అదనపు కౌంటర్లు తెరచి ఉంచేలా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. వీఎల్ పురంలోని సచివాలయం -23, ప్రకాష్ నగర్ మీసేవాలో 14, సీతంపేట మీసేవాలో 81, కోటిపల్లి బస్టాండు మీసేవాలో 36, నారాయణపురం సచివాలయం-3, బొగ్గులదిబ్బ సచివాలయం-42, బర్మా కాలనీ సచివాలయం-89 యథావిధిగా పనిచేస్తాయని తెలిపారు.

బుర్రిలంకలో అగ్ని ప్రమాదం



బాధితులకు సాయం అందజేస్తున్న రాంజీ తదితరులు

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంకలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో పి.కొండారత్నం, ఎం.త్రివేణిలకు చెందిన రెండు ఇళ్లు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించిందని బాధితులు తెలిపారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమని చెబుతున్నారు. కాగా స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రాన్ని సమాచారం ఇవ్వడంతో వారు సంఘన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ రూ.10వేలు, స్థానికులు నూనె ప్రభు రూ.5వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి విజయం దిశగా అడుగులు వేయాలి



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్ తదితరులు

సీటీఆర్ఐ: ప్రతి విద్యార్థి తన తప్పులను తెలుసుకుని, శక్తి సామర్థ్యాన్ని పెంచుకుని విజయం దిశగా అడుగు వేయాలని రాజమండ్రి నగర శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యాన్యువల్ అండ్ స్పోర్ట్స్ డే సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడాతూ గెలుపు ఓటమి ఎప్పుడూ శాశ్వతం కాదని పట్టుదలతో ప్రయాత్నిస్తే విజయం సాధించవచ్చని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి రమణమూర్తి, డిగ్రీ కళాశాల ఆర్జేడీ డాక్టర్ ఎస్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శరత్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులందరూ అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నగదు పురస్కారం అందించారు. ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థుల ఆంధ్ర నాట్యం అందరినీ అలరించింది.

ఉపాధి కూలీల ఆందోళన

రాజానగరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్‌ఈజీఎస్) ద్వారా పనులు చేస్తున్న కూలీలకు గత మూడు నెలల వేతనాల చెల్లింపులు జరుగకపోవడాన్ని నిరసిస్తూ రాజానగరంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని అంతా తూర్పరా పట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు మాట్లాడుతూ గాంధీ మహాత్ముని పేరుతో నిర్వహిస్తున్న ఈ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించలేక, పాలకులు నీరుకారుస్తున్నారని విమర్శించారు. గతంలో కూలీలను ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లించడంతోపాటు పనిముట్లకు, వేసవిలో సదుపాయాలకు సొమ్ములు కూడా ఇచ్చేవారని గుర్తు చేశారు. ఇప్పుడు అటువంటి అదనపు సదుపాయాల మాట దేవుడెరుగు, చేసిన పనికే వేతనాలు ఇవ్వని పరిస్థితులలో ప్రభుత్వాలు ఉండటం సిగ్గు చేటన్నారు. తక్షణమే కూలీల వేతన బకాయిలను చెల్లించి, ఆదుకోవాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలతోపాటు సంఘ ప్రతినిధులు పి.వెంకట్‌నాయుడు, చిరుకూరు నాగమ్మ, షేక్ ఆందాబీ, అబ్బులు, వరలక్ష్మి, పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

పెదపూడి: ప్రతి ఒక్కరూ శ్రద్ధతో ఏక మనస్సుతో ధ్యానం చేయడం వల్ల వారికి మానసిక ప్రశాంతత లభిస్తుందని కాకినాడ రామచంద్రమిషన్ ప్రతినిధి జానకి తెలిపారు. పెదపూడి సత్యసాయి సేవా సమితి ఆశ్రమంలో కాకినాడ రామచంద్రమిషన్ వారి ధ్యానోత్సవం శనివారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ వారు చేసే వృత్తులు, పనిపాట్లులో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఒత్తిడి ద్వారా వారు మానసికంగా, శారీరకంగా అనారోగ్యం పాలవుతున్నారన్నారు. వారు ఒత్తిడి నుంచి దూరంగా ఉండి సంపూర్ణ ఆరోగ్యం పొందడానికి ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజు, స్థానిక సేవా సమితి కన్వీనర్ మార్ని సత్యనారాయణ, సేవాదళ్ ప్రతినిధులు లొల్ల శ్రీరామమూర్తి, ముమ్మారెడ్డి పట్టాభి, బొడ్డు హరికృష్ణ, రామచంద్రమిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.